నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మాదాపూర్: మాదాపూర్‌లోని పలు ప్రాంతాలలో ఫీడర్ మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని అధికారులు తెలిపారు. అయ్యప్పసొసైటీ సబ్‌స్టేషన్ 11కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వివేకానందనగర్, పర్వత్‌నగర్, ప్రభుత్వ హాస్పిటల్ ఏరియా తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదని తెలిపారు.

వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో..

చందానగర్: వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- పీజేఆర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు పీజేఆర్ రోడ్డు 1,2,3,5,7,10,12, మాధవపురి హిల్స్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 50 (4 కేజీలు), పచ్చిమిర్చి 50, బెండ 50, కాకర 60, దొండ 40, దోస 40, ఆలు 30, చామ 60, కీర 30, బీర 60, వంకాయ 30, గోకర 50, బీన్స్ 60, బీట్‌రూట్ 50, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 20, క్యారెట్ 50, చిక్కుడు 60, ఉల్లి 30(కేజీ), ములక్కాయలు (3) 20 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 80, వెల్లుల్లి 350.

నేడు సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలో రూ.98 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులకు ఎమ్మెల్యే గాంధీ శంకుస్థాపన చేయనున్నారు. సోమవారం ఉదయం 11 గంటలకు రూ.60 లక్షలతో శిల్పాగార్డెన్‌లో, క్రాంతివనం కాలనీలో రూ.20 లక్షలతో, కెఎస్‌ఆర్ ఫ్రెడ్ కాలనీలో రూ.18 లక్షలతో నిర్మించే సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారు.

పోలీసుల అదుపులో బార్ లైసెన్స్ కేసు నిందితుడు

గచ్చిబౌలి: బార్ లైసెన్స్ ఇప్పిస్తానని ఘరానా మోసానికి పాల్పడిన నిందితుడు వెంకట పవన్‌ను రాయదుర్గం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వ పెద్దలు, ఎక్సైజ్ అధికారులు తనకు తెలుసునని నమ్మించి రాయదుర్గం పీఎస్ పరిధిలో బార్ లైసెన్స్ ఇప్పిస్తానని కోటి రూపాయలు దండుకున్నాడని బాధితులు పోలీసులను ఆశ్రయించిన విషయం తెలిసిందే. విచారణ చేపట్టిన రాయదుర్గం పోలీసులు ప్రధాన నిందితుడు కొడంగల్‌కు చెందిన జి.వెంకట పవన్‌తో పాటు ఎక్సైజ్ పోలీసులమని చెప్పి బాధితులతో మాట్లాడిన మరో ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

బహుమతుల పంపిణీ

చందానగర్: వరల్డ్ పవర్ లిఫ్టింగ్ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో హుడా కాలనీలో ఆదివారం పవర్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ ఒలింపిక్ సంఘం కార్యదర్శి కొండ విజయ్‌కుమార్ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు రేఖ. కార్యదర్శి తిరుపతి, ప్రసాద్, సునీల్‌రాజ్ పాల్గొన్నారు.

నేడు శివాలయాల్లో ప్రత్యేక పూజలు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శ్రీ రామలింగేశ్వర దేవస్థానం, జె.పి కాలనీలోని శ్రీ ఉమామహేశ్వర దేవస్థానం, చైతన్యనగర్ కాలనీలోని మహాదేవుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మహా శివరాత్రి మండల పూజల్లో భాగంగా సోమవారం ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. అదేవిధంగా శ్రీ రామలింగేశ్వర దేవస్థానంలో శివ స్వాములకు ప్రసాద వితరణ ఉంటుందని ఆలయ అర్చకులు మహేష్ తెలిపారు.

దశలవారీగా సమస్యల పరిష్కారం

కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

మియాపూర్: కాలనీ, బస్తీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పేర్కొన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీరంగంపురం కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌ను కలిసి కాలనీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. కాలనీలో ఎలాంటి సమస్యలు తలెత్తినా తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు కేశవ్, కాలనీవాసులు షాబుద్దీన్, శ్రీధర్, సుబ్బారావు, కొండల్‌రావు, రాంగోపాల్, సత్యనారాయణరెడ్డి, అనంతరాములుచారి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయ.. ఎవర్‌గ్రీన్

అంతటా పచ్చదనంతో ఆహ్లాదపూరితంగా.. | **2018లోనే కేవీఎస్ రీజనల్ స్థాయిలో గుర్తింపు** | **ఆదర్శంగా నిలుస్తున్న గచ్చిబౌలి కేంద్రీయ విద్యాలయ**



చెట్లకు, కుండీలకు చిత్రాలు



రాయదుర్గం: 'స్వచ్ఛత ,గ్రీనరీ'కి కేరాఫ్‌గా మారింది కేంద్రీయ విద్యాలయం. పరిసరాల శుభ్రత, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్‌ను పాటిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. భారీ వృక్షాలతో క్యాంపస్ అలరారుతోంది. 1987లో గచ్చిబౌలిలోని జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లో 5 ఎకరాల స్థలంలో కేంద్రీయ విద్యాలయను ప్రారంభించారు. కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇంగ్లిషు మీడియం కో-ఎడ్యుకేషన్‌ను సీబీఎస్‌ఈ సిలబస్‌తో కొనసాగుతోంది.

2018లో అవార్డు

- గచ్చిబౌలి కేంద్రీయ విద్యాలయం పూలు, పండ్ల మొక్కలు, పచ్చదనంతో ఆకట్టుకుంటోంది. హైదరాబాద్ రీజియన్ స్థాయిలో స్వచ్ఛ విద్యాలయ అవార్డు–2018ను సాధించింది.
- ఏటా మొక్కలు నాటుతూ, ఉన్నవాటిని రక్షిస్తున్నారు. స్వచ్ఛ పాఠశాలగా రూపుదిద్దుకోవడం విద్యార్థులు, ఉపాధ్యాయుల సమష్టి కృషి ఫలితమే.
- ప్రతి ఏటా స్వచ్ఛపక్వాడా కార్యక్రమంలో భాగస్వాములవుతూ జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌వాసులు కూడా పాటించేలా ర్యాలీలు, ప్లకార్డుల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు
- క్యాంపస్‌లోని కొంత స్థలంను ఎంపిక చేసి అందులో రకరకాల గులాబీ మొక్కలు పెంచుతున్నారు
- విద్యార్థులు వెట్ వేస్ట్, డ్రై వేస్ట్‌ను వేయడానికి ప్రత్యేక డస్ట్‌బిన్లను వాడడం, ఎండిన ఆకులు, ఇతర వ్యర్థాలను అందులో వేయించి వాటితో ఎరువు తయారు చేసి వాటిని మొక్కల కోసం వాడుతున్నారు
- కుండీలకు రంగులు వేసి అందంగా తీర్చిదిద్దుతున్నారు. అలాగే విద్యాలయంలోని భారీ వృక్షాలకు రంగులు వేసి కలర్‌ఫుల్‌గా తీర్చిదిద్దుతున్నారు. సహజసిద్ధంగా ఉన్న భారీ బండరాళ్లపై చిత్రాలు వేయించారు.



పచ్చదనం, స్వచ్ఛతపై ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

జాతీయ అవార్డు లక్ష్యం

కేంద్రీయ విద్యాలయ గచ్చిబౌలిని క్లీన్ అండ్ గ్రీన్ క్యాంపస్ కోసం కృషి చేస్తున్నాం. స్వచ్ఛత విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాం.గతంలో అవార్డు రావడంతో మరింత బాధ్యత పెరిగింది. జాతీయస్థాయిలో కూడా అవార్డు సాధించడమే లక్ష్యం. విద్యాలయలో 100 శాతం ఫలితాలు, కళలు ,క్రీడలు, ఇతర రంగాలలోనూ విద్యార్థులు రాణించేలా ఉపాధ్యాయ బృందంతో కలిసి నిరంతరం ప్రోత్సహిస్తున్నాం. –జితేంద్రకుమార్, ప్రిన్సిపల్, కేంద్రీయ విద్యాలయ, గచ్చిబౌలి



కేవీలో సైకిల్‌డే



ప్రాంగణంలో గులాబీ మొక్కల పెంపకం





విద్యాలయలో స్వచ్ఛ పక్వాడా కార్యక్రమంలో విద్యార్థులు, ప్రిన్సిపల్, అధ్యాపకులు

లింగంపల్లి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థుల సత్తా

అమెజాన్ వర్క్‌షాప్
జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



శేరిలింగంపల్లి: అమెజాన్ సంస్థ సహకారంతో నిర్వహించిన సైన్స్ ప్రాజెక్ట్ పోటీలలో లింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఏకంగా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అమెజాన్ సంస్థ సహకారంతో క్వెస్ట్ అలియన్స్ వారు నిర్వహించిన సైన్స్ ప్రాజెక్ట్ వర్క్‌షాప్‌లో లింగంపల్లి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు రాగిణి, కీర్తన, దుర్గాప్రసాద్ కలిసి ఉపాధ్యాయుడు పి శ్రీకాంత్ పర్యవేక్షణలో 'కీప్ సెక్యూరిటీ అలారమ్'ను తయారు చేశారు. ఈ మేరకు వారు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అమెజాన్ సంస్థ ఈనెల 21వ తేదీన న్యూఢిల్లీలో జాతీయ స్థాయి పోటీలను నిర్వహించనుంది. అందులో వీరు పాల్గొనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం లింగంపల్లి జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం శైలజ మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీలకు పాఠశాల విద్యార్థులు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి



పార్టీలో చేరిన వారితో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, నాయకులు

ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీజేపీ పటిష్టతకు కృషి చేయాలని చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి ఇంచార్జీ ఎం.రవికుమార్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు బీజేపీలో చేరారు. వారికి విశ్వేశ్వర్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని సూచించారు. రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా సాగాలన్నారు. బీజేపీలో చేరిన వారిలో కొండాపూర్, మాదాపూర్ డివిజన్‌కు చెందిన పట్టాభిరామ్, కనికంటి ప్రభాకర్‌రావు, అంకమ్మ చౌదరి, బ్రహ్మ, వెంకటేష్, శ్రీకాంత్ నర్సింహ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రాధాకృష్ణ యాదవ్, ఎల్లేష్, మాణిక్‌రావు, రెడ్యానాయక్, శివ ఉన్నారు.

హ్యాకథాన్-2025కు వేదిక 'మనూ'

- ఫిబ్రవరి 3 నుంచి 6 వరకు నిర్వహణ
- ఈవెంట్ కన్వీనర్ డాక్టర్ ప్రియాహసన్ వెల్లడి

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం ప్రాంతీయ స్థాయి హ్యాకథాన్–2025 పోటీలకు వేదిక కానుందని ఈవెంట్ కన్వీనర్ డాక్టర్ ప్రియాహసన్ ఆదివారం వెల్లడించారు. ఫిబ్రవరి 3 నుంచి 6వ తేదీ వరకు పోటీలు నిర్వహించాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. ఈ పోటీలలో పాల్గొనేవారికి వాస్తవ ప్రపంచ పరిశోధన ప్రాజెక్టులలో వేగవంతమైన వాతావరణాలలో అనుభవాన్ని అందించడానికి అవకాశం కలుగుతుందన్నారు. ఈ హ్యాకథాన్‌లో పాల్గొనడానికి జాతీయ స్థాయిలో 30 మంది విద్యార్థులకు అవకాశం ఉంటుందన్నారు పైథాన్ ప్రోగ్రామింగ్ నైపుణ్యం కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

తాగుడుకు బానిసై వ్యక్తి మృతి

మియాపూర్: తాగుడుకు బానిసైన వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్ న్యూ హఫీజ్‌పేట్ ప్రేమ్‌నగర్ కాలనీ సమీపంలో ఓ వ్యక్తి పడిపోయి ఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా ఆ వ్యక్తి ఉత్తర్‌ప్రదేశ్ మహరాజ్ గంజ్ జిల్లా దిగవా గ్రామానికి చెందిన శైలేష్ యాదవ్(35) కొంతకాలం క్రితం నగరానికి వచ్చి హఫీజ్‌పేట్‌లో ఉంటూ పెయింటర్‌గా పని చేస్తున్నాడు. గత కొంతకాలంగా తాగుడుకు బానిసై కుటుంబాన్ని వదిలేసి జీవిస్తున్నాడని తెలిపారు. తాగుడుకు బానిసై అనారోగ్యంతో మృతి చెందాడని పోలీసుల ప్రాథమిక అంచనాలో తేలింది. ఈ మేరకు మృతుడి బంధువు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

26న ఉచిత కేన్సర్ నిర్ధారణ పరీక్షలు

ఆల్విన్‌కాలనీ: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కూకట్‌పల్లి రాందేవ్‌రావ్ హాస్పిటల్‌లో ఈ నెల 26వ తేదీ ఆదివారం ఉదయం 9 నుంచి మ.2 గంటల వరకు కేన్సర్ నిర్ధారణ ఉచిత వైద్య మెగా శిబిరం నిర్వహించనున్నారు. ఈ శిబిరంలో నోటి కేన్సర్ , రొమ్ము కేన్సర్ , మలద్వార కేన్సర్ , గర్భాశయ ముఖ ద్వార కేన్సర్ వంటి పలు రకాల కేన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మమోగ్రఫి, ఎక్స్‌రే, ఎంఆర్ఐ, సిబిపి లిక్విడ్ బేస్డ్ సైటాలజీ, హెచ్‌పివిడిఎన్‌ఎ టెస్టింగ్ యుఎస్‌జి అబ్డామిన్ వంటి పరీక్షలను ఉచితంగా నిర్వహించనున్నట్లు ఆస్పత్రి నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

పటాన్‌చెరు టౌన్: నిరుపేదల ఆరోగ్య సంరక్షణ కోసం ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని వాసవి కల్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం పటాన్‌చెరు శాఖ, బండారు హాస్పిటల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రామ్మోహన్ గుప్తా, ప్రముఖ వైద్యులు డాక్టర్ సుప్రఘత్ కుమార్ పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం తగదు

ఆల్విన్‌కాలనీ: పారిశుద్ధ్య కార్మికులు బాధ్యతగా విధులు నిర్వహించాలని ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. డివిజన్ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల హాజరుపట్టీని ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో మొత్తం 30 మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. ప్రజలు కూడా తమ వంతు బాధ్యతగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్తా చెదారాన్ని కాలువలు, చెరువుల్లోనూ వేయకుండా ఆటో కార్మికులకు మాత్రమే అందజేయాలన్నారు.



కనువిందుగా..



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం శ్రీ శర్వాణి కూచిపూడి నృత్యాలయం గురువు డాక్టర్ భార్గవి ప్రేమ్ శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో సందర్శకులను అలరించారు. ఇందులో గణేశకౌతం, జతిస్వరం, దశావతారం శబ్దం, హిందోళతిల్లాన, శివాష్టకం, కృష్ణశబ్దం, స్వాగతం కృష్ణ, కృష్ణజనన శబ్దం, కృష్ణ ముకుంద మురారి, మంగళం తదితర అంశాలను ప్రదర్శించారు. కళాకారులు సాయి సహస్ర, మహన్యా, ఆరాధ్య, అనన్య, లాస్యనందిని, ఆద్య, స్వస్థిరా, హారిణి, రక్షిత, రిప్సిత, మనస్వి, షెర్విని పాల్గొన్నారు.



మైత్రి క్రికెట్ పోటీలు ప్రారంభం



పటాన్‌చెరు: యువత క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సూచించారు. క్రికెట్ అభివృద్ధికి మైత్రి క్రికెట్ క్లబ్ సేవలు అభినందనీయమన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో మైత్రి క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 35వ మైత్రి క్రికెట్ పోటీలను ఆదివారం ఉదయం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నగేష్, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, మైత్రి క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు హనుమంతరెడ్డి, పారిశ్రామికవేత్తలు సత్యనారాయణరెడ్డి, సీఐ వినాయక్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి, అఫ్జల్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ధర్మగిరి రోడ్డు– రైల్వే గేట్ రోడ్డు.. విస్తరణ జరిగేనా..?

- స్థానికుల నుంచి అభ్యంతరాల వెల్లువ
- రహదారి విస్తరణపై పునరాలోచన
- ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారిస్తున్న అధికారులు

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని ధర్మగిరి రోడ్డు నుంచి రైల్వే గేటు వరకు ఉన్న రహదారి విస్తరణపై అధికారులు పునరాలోచనలో పడ్డారు. ప్రస్తుత రహదారిని 80 ఫీట్ల రహదారిగా విస్తరించేందుకు హెచ్‌ఆర్‌డీసీ సిద్ధం కాగా స్థానికులు నుంచి అభ్యంతరాలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో రహదారి విస్తరణపై అధికారులు ప్రత్యామ్నాయం వైపే మొగ్గుచూపుతున్నారు.

ఎందుకు..?

ధర్మగిరి రోడ్డు ఎరుకల గడ్డ నుంచి రైల్వే గేటు వరకు ఉన్న రహదారి విస్తరణలో 208 మంది బాధితులున్నట్లు మున్సిపల్ అధికారులు గుర్తించారు. ఇందులో కొందరి ప్లాట్లు, కొందరి ఇళ్లు పాక్షికంగా మరికొందరి ఇళ్లు పూర్తి స్థాయిలో కోల్పోయే అవకాశం ఉండటంతో రహదారి విస్తరణపై స్థానికులు అభ్యంతరాలను వ్యక్తం చేశారు. భారీగా ఆస్తులు కోల్పోయే వారికి ప్రత్యామ్నాయం ఎలా చెల్లిస్తారనే ప్రశ్నలూ వెల్లువెత్తాయి. హెచ్‌ఎండీఏ మాస్టర్ ప్లాన్ రూపొందించకముందు నుంచీ స్థానికంగా నివాసాలున్నాయని అలాంటి వాటిని ఎలా తొలగిస్తారని కూడా ప్రశ్నిస్తున్నారు.

కీలక సమస్య...

ఈ రహదారి విస్తరణ చేపడితే రైల్వే గేటు వద్ద ట్రాఫిక్ రద్దీ పెరిగి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందనే వాదనలున్నాయి. రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్ నిర్మిస్తే తప్ప రహదారి విస్తరణతో ఎలాంటి ప్రయోజనం ఉండదనే అభిప్రాయాలు కూడా స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. పాత పోలీస్‌స్టేషన్ రహదారిలో కూడా ప్రస్తుతం ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉన్న కారణంగా సంబంధిత రహదారి విస్తరణపై అధికారులు ఆలోచించాలనే వాదనలు కూడా లేకపోలేదు.



ధర్మగిరి రోడ్డు నుంచి రైల్వే గేటుకు వెళ్లే రహదారి

పరిహారం కూడా..

ఆస్తులు కోల్పోయే వారికి పరిహారం చెల్లించే విషయం కూడా గుదిబండగా మారుతుందనే ఆందోళన నెలకొంది. ఈ కారణంగా ప్రత్యామ్నాయ మార్గంలోనే రహదారిని చేపడితేనే ఎంతో మేలని మున్సిపల్ అధికారులు సైతం భావిస్తున్నారు. పరిహారం చెల్లింపు కన్నా ప్రత్యామ్నాయమే బెటర్ అనే అంశం కూడా ప్రస్తుతం తెరపైకి వచ్చింది.